ప్రజాశక్తి

ఆదివారం 7 జనవరి 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి







కళారూపాలతో ఆలోచింపజేసిన విద్యార్థులు

సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్ అదుర్స్

కళా ప్రతిభను ప్రస్ఫుటం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతిభే కొలమానం.. అవధులు లేని ఉత్సాహం. ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా రెండు రోజులుగా జరుగుతున్న 37వ సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్ (యూనిఫెస్ట్) 2023-24 దీనికి వేదికయ్యింది. రెండో రోజైన శనివారం యువ భేరి కార్యక్రమంలో భాగంగా ఉదయం శాస్త్రీయ నృత్యాలు, స్పాట్ పెయింటింగ్, శాస్త్రీయ వాయిద్యం, క్విజ్, మిమిక్రీ పోటీలను నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి రూపకాలు, శాస్త్రీయ గాత్రం, స్పాట్ ఫొటోగ్రఫీ పోటీలను ఎయు కన్వెన్షన్ సెంటర్, సాగరిక ఆడిటోరియం, ఎయు స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ వేదికల్లో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరి నుంచి 23 విశ్వవిద్యాలయాకు చెందిన 800 మంది విద్యార్థులు ఈ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. ఆరు విభాగాలలో 28 అంశాలలో పోటీలు జరుగుతున్నాయి. దేశం నలుమూలల నుంచి వచ్చిన నిపుణులైన 19 మంది న్యాయ నిర్ణేతలుగా ఉన్నారు. వారిని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఎంపికచేసి విజేతలను నిర్ణయించే ప్రక్రియను అప్పగించింది. సాంస్కృతిక మిగతా 2లో..

మున్సిపల్ కార్మికులపై

పోలీసుల కర్కశం



సిఐటియు రాష్ట్ర నాయకులు జగ్గునాయుడును అరెస్టు చేస్తున్న పోలీసులు

- జివిఎంసి పరిధిలో 400 మంది అరెస్ట్
- ఎక్కడికక్కడ నిర్బంధంపై మండిపడ్డ వర్కర్లు



జివిఎంసి సమీపాన కార్మికులను, మున్సిపల్ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

మున్సిపల్ కార్మికుల సమ్మె 12వ రోజుకు చేరుకుంది. శనివారం జివిఎంసి ముట్టడికి యత్నించిన కార్మికులపై ప్రభుత్వం తీవ్ర పోలీసు నిర్బంధం ప్రయోగించింది. నగరంలోని అన్నిచోట్లా కలిపి 400 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అనకాపల్లిలో చెత్త తరలింపునకు అధికారులు చేసిన ప్రయత్నాలను కార్మికులు అడ్డుకున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చనిదే సమ్మెను విరమించేది లేదన్నారు.

(వార్తలు 4లో..)

బెల్లం ఆధారిత ఉత్పత్తులతో ఆదాయం

వార్త 6లో..

విశ్రాంత ఉద్యోగులందరికీ పెన్షన్ ఇవ్వాలి

వార్త 2లో..

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి


వార్త 5లో..



షాట్ కొడుతున్న బెంగాల్ క్రీడాకారుడు

సందడిగా ఆంధ్ర - బెంగాల్ మ్యాచ్

ప్రజాశక్తి - పిఎం.పాలెం : విశాఖ నగరంలోని పిఎం.పాలెం ఎసిఎ-విడిసిఎ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా కొనసాగుతున్న ఆంధ్ర - బెంగాల్ జట్ల రంజీ ట్రోఫీ సందడిగా సాగుతోంది. బెంగాల్ జట్టు తొలి రెండు రోజుల్లో 409 పరుగులు చేసి ఆలౌటైంది. ఆ జట్టులో అభిషేక్ పోరెల్, మనోజ్ తివారీ రాణించారు. ఆంధ్ర జట్టు బౌలర్లు ఎ.లలిత్ మోహన్ 4 వికెట్లు, సోయబ్ మహమ్మద్ ఖాన్, కెవి.శశికాంత్‌లు చెరో రెండు వికెట్లు తీశారు. మొదటి ఇన్నింగ్స్‌లో భాగంగా బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు 48.1 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 119 పరుగులు చేసింది. ఆంధ్ర జట్టు ఓపెనర్లు ప్రశాంత్ కుమార్ 116 బంతుల్లో 41 పరుగులు, గ్నానేస్వర్ 65 బంతుల్లో 33 పరుగులు చేశారు.



పెరుగుతున్న కోవిడ్ కేసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో కోవిడ్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మీడియాకు అందజేసిన సమాచారం ప్రకారం డిసెంబర్ 21 నుంచి ఈ నెల 6 వరకూ కోవిడ్ నిర్ధారణ టెస్టులు 975 నిర్వహించారు. అందులో 62 మందికి పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం కోవిడ్ బాధితులు 34 మంది ఉండగా 32 మంది ఇంటిలోనే ఉండి వైద్య సేవలు పొందుతున్నారు. ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. గడిచిన 24 గంటల్లో 50 మందికి టెస్టులు చేయగా పది మందికి కోవిడ్ ఉన్నట్లు నిర్ధారణైంది. వీరిలో తొమ్మిది మంది వారి వారి ఇళ్లలో వైద్యం పొందుతుండగా ఒకరు ఆసుపత్రిలో చేరారు.



అనకాపల్లిలో జిఒ కాపీలను దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు

ఎస్మాపై అంగన్‌వాడీల భగ్గు

ఎక్కడికక్కడ దీక్షలు, నిరసనలు వార్తలు 8లో..

మొదటి పేజీ తరువాయి..

సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్ అదుర్స్

పోటీలను ఎఐయు అబ్జర్వర్ డాక్టర్ మనీష్ జంగ్ర పర్యవేక్షించారు. శనివారం జరిగిన పోటీలను కల్చరల్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఎన్.విజయ్ మోహన్, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ప్రిన్సిపాల్స్ ఆచార్య జి.శశిభూషణరావు, వై.రాజేంద్రప్రసాద్, డీన్‌లు ఆచార్య టి.షారోన్ రాజు, ఆచార్య ఎ.పల్లవి, ఆచార్య కె.బసవయ్య, ఆచార్య వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని వీక్షించారు.



సదస్సులో మాట్లాడుతున్న అజశర్మ, వేదికపై పలువురు అతిథులు

విశ్రాంత ఉద్యోగులందరికీ పెన్షన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి, దీర్ఘకాలం సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన వారందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విశాఖపట్నం డివిజన్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సు ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. సదస్సుకు అసోసియేషన్ అధ్యక్షులు కె.మోహనరావు అధ్యక్షత వహించారు. ఎఐపిపిఎ అధ్యక్షులు సతన్జీజిబ్ దాస్, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 13,80 లక్షల మంది వయోవృద్ధులు ఉన్నారన్నారు. వారిలో కొద్ది మందికి మాత్రమే వారి సంస్థ నుంచి పెన్షన్లు అందుతున్నాయని తెలిపారు. మిగిలిన వారందరికీ ఏవిధమైన ఆర్థిక ఆసరా లేనందున వారి ఆర్థిక అవసరాల కోసం వారి వారి పిల్లలపై ఆధారపడుతున్నారని చెప్పారు. ఆర్థిక భారాలు పెరిగిపోయిన ఈ రోజుల్లో వారికి తల్లిదండ్రులు భారంగా మారిపోయారన్నారు. అందుకే నిత్యం కొంతమంది అభాగ్య సీనియర్లు రోడ్లపైకి నెట్టబడుతున్నారన్నారని, ఘోరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీనియర్లు అందరూ సర్వీసు కాలంలో వారి వారి సంస్థలకు విశేషమైన సేవలందించిన వారేనని, వారి శ్రమ వల్ల ఆయా సంస్థలు అభివృద్ధి చెందాయని అన్నారు. జాతీయ ఉత్పాదకతలో కూడా వారు భాగస్వాములైనందున వృద్ధాప్యంలో వారి బాగోగులు చూడవలసిన బాధ్యత ఆయా సంస్థలది, ప్రభుత్వానిదని అన్నారు. వయోవృద్ధుల జీవనం కోసం నిధులను ప్రభుత్వాలు కేటాయించాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలోని ఆర్టికల్ 41లో పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. పెన్షన్ భిక్ష కాదని, వృద్ధాప్యం కోసం వాయిదా వేసిన జీతవని తెలిపారు. యాజమాన్యాలు పెన్షన్ల కోసం నిధులను కేటాయించాలని 1992లో సుప్రీంకోర్టు సలహా ఇచ్చిందని గుర్తు చేశారు. దాన్ని కేంద్రం, కొన్ని సంస్థలు పెడచెవిన పెట్టాయని తెలిపారు. ప్రభుత్వాలు 2004 నుంచి న్యూ పెన్షన్ స్కీం అమలు చేస్తున్నాయని చెబుతూ దీంతో జరిగే ప్రమాదాన్ని వివరించారు. సదస్సులో డిఫెన్స్ పెన్షనర్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకట్రావు, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బిటి.మూర్తి, బిఎస్ఎన్ఎల్, డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు అసరఫ్, రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు వి.నరసింగరావు, ఐసిఇయు డివిజన్ అధ్యక్షురాలు ఎం.కామేశ్వరి, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాగర్, జిఐపిపిఎ అధ్యక్షులు పివి. సుబ్బారావు, కార్యదర్శి సాల్మన్ రాజు, పోస్టల్ పెన్షనర్స్ అసోసియేషన్ డివిజనల్ కార్యదర్శి ఎంఆర్‌డి.రాజు, డిఫెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.రామాంజనేయులు మాట్లాడారు.

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్లాస్టిక్‌ను తగ్గించడం లక్ష్యంగా ఐటిసి ఫుడ్స్ వంద శాతం పేపర్ బ్యాగ్ ప్యాకేజింగ్‌లో, సన్‌ఫీస్ట్ ఫార్మలైట్ డైజెస్టివ్ బిస్కెట్ ఫ్యామిలీ ప్యాక్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి ఆలీ హరీష్ షేర్ శనివారం ఓ హోటల్‌లో మాట్లాడారు.

పాఠం నేర్వకుంటే గుణపాఠం తప్పదు !

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రజలతో విశ్వాసపాత్రునిగా మెలగని, ప్రజాస్వామికంగా వ్యవహరించని ప్రభుత్వాలెలా పతనమయ్యాయో వైసిపి ప్రభుత్వానికి తెలిసినట్లులేదు. తెలిసినా అధికార మత్తులో విచక్షణ కోల్పోయి విన్యాసాలు చేస్తుందో తెలీదు. తెలిసి చేసినా, తెలియక చేసినా, అహంకారంతో చేసినా నియంతృత్వాన్ని ప్రజలు అంగీకరించరు, ఆమోదించరు, భరించరని మాత్రం తెలుసుకోవాలి. ఉద్యోగులు, స్కీం వర్కర్లు, ఉద్యమకారులను బెదిరించి, పోరాటాలను బలప్రయోగంతో అణచివేస్తే ఆగిపోతాయన్న భ్రమలో ప్రభుత్వం వున్నట్లుంది. కానీ, తన పతనం అక్కడ నుంచే ఆరంభమవుతుందని తెలుసుకోలేకపోతుంది. 26 రోజులుగా అందోళన చేస్తున్న అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం ప్రజాస్వామికవాదులెవరూ హర్షించరు. ఈ ప్రభుత్వముంటుందో, వూడుతుందో తెలీదుగానీ ఆరు నెలల పాటు సమ్మెలు, నిరసనలు నిషేధిస్తూ శనివారం జిఒ జారీచేసింది. నిర్బంధాలు, అణచివేతలు, బెదిరింపులకు దిగడం ఈ ప్రభుత్వానికి, అందునా ఈ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి కొత్తేమోకానీ అంగన్‌వాడీలకు కాదు. వాటన్నింటినీ ఎదుర్కొని పోరాడి కొన్ని హక్కులు, సదుపాయాలు సాధించుకున్న ధీరవనితలు వారు. అంగన్‌వాడీలపై గుర్రాలను ఉసిగొల్పి తొక్కించిన చంద్రబాబు నాయుడు నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదురొడ్డిన పోరాటానుభవంలో ఈ ఎస్మాలు వారు లెక్కచేస్తారని ప్రభుత్వం అనుకోవడం ఒట్టి భ్రమ. శుక్రవారం నాటికి విధుల్లో చేరకపోతే శాఖరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించినా, వెనుదిరగకుండా రిలే దీక్షలకు దిగారంటే వారి పట్టుదల ఎంత శక్తివంతమైనదో ప్రభుత్వం గ్రహించి సమస్యలు పరిష్కారానికి చొరవ



చూపాలి. వాస్తవానికి చట్టవిరుద్ధమైన చర్యలు ప్రభుత్వం చేస్తోంది తప్ప అంగన్‌వాడీలు కాదు. గ్రాట్యూటీ చెల్లించాలని సుప్రీం తీర్పును అమలుచేయాలని అడుగుతున్న అంగన్‌వాడీలది తప్పా? తీర్పును ఉల్లంఘించిన ప్రభుత్వానిది తప్పా?. ఆలోచనపరులెవరైనా ప్రభుత్వానిదే తప్పంటారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో కంటే ఎక్కువ జీతం పెంచాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు. ఇదెలా తప్పవుతుంది? తప్పు ప్రభుత్వానిది పెట్టుకొని అంగన్‌వాడీలపై నెట్టడమే ప్రభుత్వం చేస్తున్న మరో తప్పు.

ఎస్మా చట్టం ప్రయోగిస్తూ జారీ చేసిన జిఒకు మూడ్రోజుల ముందు సమ్మెలోవున్న ఎస్-ఎస్ఎ నాన్ టీచింగ్ స్టాఫ్‌కు తొలగింపు ఉత్తర్వులు జారీ చేసింది. విధుల్లో చేరకపోతే తొలగిస్తామని బెదిరించి, సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి కుయుక్తులు పన్నింది. అయినా వారు తమను రెగ్యులర్ చేయాలని, అంతవరకు మినిమం టైమ్ స్కేల్ సహ హెచ్ఆర్ఎ, డిఎ వర్తింపజేయాలన్న న్యాయమైన డిమాండ్‌ను వదులుకోలేదు.

ఉద్యోగులు, స్కీం వర్కర్లు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు, నిరుద్యోగుల్లో ప్రభుత్వ చర్యలు ఆగ్రహాన్ని పెంచుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకత పెరగడానికి దారితీస్తున్నాయి. గతానుభవాలను గుర్తెరిగి సమ్మెలోవున్న అంగన్‌వాడీ, ఎస్ఎస్ఎ, మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చొరవ చూపాలి. నిర్బంధ, నియంతృత్వ పద్ధతులు వీడాలి. తనకు ఇష్టంలేని నియోజకవర్గాల్లో సమన్వయకర్తలను మార్చినంత సులభంగా, ఉద్యోగులు, స్కీం వర్కర్ల పట్ల వ్యవహరిస్తే దాని దుష్ఫలితాలు వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వం మెడకు చుట్టుకుంటాయని గ్రహిస్తే మంచిది.

గ్లోబల్ హెల్త్ కేర్ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని సీతమ్మధార హెచ్‌బి కాలనీ రోడ్డులో ఏర్పాటు చేసిన 'గ్లోబల్ హెల్త్ కేర్' సెంటర్‌ను కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ శనివారం ఉదయం ప్రాంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ విశాఖ మహా నగరంలో ఆసుపత్రులకు కొదువలేదన్నారు. ప్రభుత్వం వాడవాడలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పి వైద్య సేవలు అందిస్తోందన్నారు. గ్లోబల్ హెల్త్ కేర్ సెంటర్ మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. గ్లోబల్ హెల్త్ కేర్ నిర్వాహకులు రవీంద్రనాథ్, పరశురామ్ మాట్లాడుతూ సీతమ్మధార హెచ్‌బి.కాలనీ పరిసర ప్రాంత వాసులకు అందుబాటు ధరలలో వైద్య సేవలు అందించాలనే దృక్పథంతో దీన్ని నెలకొల్పామన్నారు. అతి తక్కువ ఫీజులు, మెడికల్ టెస్టులు, మెడిసిన్‌పై తగ్గింపు వంటి సౌకర్యాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు అప్పరి విద్యా, మొల్లి లక్ష్మి, అప్పారావు, స్థానిక ప్రముఖులు బాబ్జీ, చిరంజీవి, రవి శంకర్ పాల్గొన్నారు.

జిందాల్‌తో ఎంఒయును బహిర్గతం చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ ఉక్కు యాజమాన్యం బిఎఫ్-3 విషయంలో జిందాల్‌తో కుదుర్చుకున్న ఎంఒయును వెంటనే బహిర్గతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు శనివారానికి 1010వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం మెటీరియల్ సప్లై, కన్వర్షన్ ఇఒఐ పేరుతో జిందాల్‌తో రెండు సంవత్సరాల పాటు ఒప్పందం చేసుకోవడం అత్యంత ఆందోళనకరమన్నారు. ఇది ప్రైవేటీకరణకు తొలిమెట్టు అని పేర్కొన్నారు.

8 నుంచి బిఎస్ఎన్ఎల్ ఐపి టివి ఒటిటి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిఎస్ఎన్ఎల్ ఐపి టివి ఒటిటిని సోమవారం నుంచి ప్రారంభిస్తోందని, వినియోగదారులు ఆ సేవలను వినియోగించుకోవాలని ఎస్‌డిఇ దొగ్గ శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. ఈ సర్వీస్ స్మార్ట్ టివి ఉన్న వాళ్ళు యాప్ ఇన్‌స్టాల్ చేసుకొని చూడవచ్చునన్నారు. స్మార్ట్ టీవీ లేని వారు ఫైర్ స్టిక్‌తో ఈ సేవలు వినియోగించుకోవచ్చునని తెలిపారు. ఈ సేవలు మొదటి వారం రోజులు ఉచితంగా పొందవచ్చని అన్నారు. డిజిటల్ ఇండియా, ఫైబర్ జె యేషన్‌లో భాగంగా అన్ని కాపర్ బేస్డ్ ల్యాండ్ లైన్లను ఫైబర్‌లోకి మార్చుతున్నట్టు తెలిపారు.

పలువురికి ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు తొమ్మిది మంది ఉద్యోగోన్నతి పొందారు. వారికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర శనివారం శుభాకాంక్షలు తెలియజేశారు.

పరిశోధనలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి -తగరపువలస : ప్రతి విద్యార్థీ ఆయా రంగాల్లో సామర్థ్యాన్ని పెంచుకుంటూనే పరిశోధనలపై దృష్టి పెట్టాలని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సాయంత్రం అవంతి విద్యా సంస్థల నుంచి ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ విభాగాల్లో పట్టభద్రులైన 800 మందికి పతకాలు, సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. 750 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, పలువురు అతిథులు ద్వారా బంగారు, రజత పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ, ఉన్నత చదువులు పూర్తి చేసి ఉన్నతోద్యోగం సంపాదించుకోవాలని విద్యార్థులకు సూచించారు. వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని స్పష్టం చేశారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్వామి వివేకానంద, అబ్దుల్ కలామ్‌లను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నతమైన జీవితాలను, భవిష్యత్తును నిర్మించు కోవాలన్నారు. ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ అబ్రహం వరుగీసే, ఎపి స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ కె.రామమోహనరావు, టేలెంట్ ఎక్విజి షన్ జెంతే టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ విశాఖ హెడ్ టి సురేష్ కుమార్, బిపిహెచ్ఆర్ ఇన్ఫోసిస్ యూనిట్ మేనేజర్ ఎ.కృష్ణప్ప, అవంతి విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం ప్రియాంక, వైస్ చైర్మన్ శివ సందీప్, మేనేజింగ్ డైరెక్టర్ ఐ.శ్రావణ్ కుమార్, అవంతి విద్యా సంస్థల ప్రిన్సిపల్స్ , డైరెక్టర్లు, ఎఒలు పాల్గొన్నారు.



పట్టభద్రులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న సిపి రవిశంకర్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి

వైసిపి మండల ఉపాధ్యక్షునిగా బిఎస్ఎన్.రాజు



ప్రజాశక్తి -భీమునిపట్నం : వైసిపి మండల ఉపాధ్యక్షునిగా మండలంలోని తాళ్లవలస గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ బుద్ధరాజు సత్యనారాయణరాజును పార్టీ అధిష్టానం నియమించింది. ఇందుకు గాను పలువురు పార్టీ నాయకులు, అతని అభిమానులు హర్షం వెలిబుచ్చారు. ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి, విస్తృతికి బిఎస్ఎన్ రాజు ఎంతగానో కృషి చేశారని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కొనియాడారు.

వైభవంగా స్వాతి నక్షత్ర హోమం

ప్రజాశక్తి-సింహాచలం : సింహాద్రినాథుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని తెల్లవారుజామునే సింహగిరిపై ప్రభాత ఆరాధానలు పూర్తిచేశారు. తదుపరి సుదర్శన స్వామిని ఆలయ ఆస్థాన మండపంలో ఆశీనులను చేసి కలశారాధన, మండపం, బింబారాధనలు పూర్తి చేశారు. అనంతరం భక్తులచే నృసింహ స్వామి అష్టోత్తర శతనామావళి పూజ చేయించారు. అగ్ని ప్రతిష్టాపన, పంచ శుక్తాలు, నృసింహ సుదర్శన మూలమంత్రాలు ఆవాహనం గావించారు. మహా పూర్ణాహుతి పూర్తి చేసి కలశతో ఆలయ ప్రదక్షిణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఇఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్ రాజు, సువాడ శ్రీదేవి, వర్మ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. నృసింహ దీక్షలను చేపట్టిన భక్తులు సింహగిరిపై శనివారం దీక్షలను విరమించారు. ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు రూపొందించిన 2024 కేలండర్‌ను శనివారం ఇఒ ఆవిష్కరించారు.

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రజాశక్తి కేలండర్‌ను స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.జనార్దనరావు శనివారం అతని కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది వెంకటరమణ పాల్గొన్నారు.



ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్దనరావు

టైలర్లను ఆర్థికంగా ఆదుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన టైలర్లను ఆదుకోవాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు ఎపి టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ అనుబంధ సంఘం జిల్లా అధ్యక్షులు గిడుతూరి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇటీవల సంఘం ప్రతినిధులతో కలిసి లోకేష్‌కు వినతిపత్రం అందజేసినట్లు శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. టైలర్ వృత్తి చేసి 45 ఏళ్ల పైబడిన వారిలో ఎక్కువ మందికి కంటి చూపు సమస్య తలెత్తుతుందని వివరించారు. 50 ఏళ్లు పైబడిన వారికి సొసైటీల ద్వారా పింఛను సదుపాయం కల్పించాలని, 200 యూనిట్ల మేర ఉచిత విద్యుత్ ఇవ్వాలని, వివిధ బ్యాంకుల ద్వారా రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేయించాలని కోరారు.

ముగిసిన నాగమణి పరిచయ ప్రచారం

ప్రజాశక్తి-పద్మనాభం : భీమిలి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తానని ప్రకటించి పద్మనాభం మండలంలో ఎన్.నాగమణి చేపట్టిన పరిచయ ప్రచార కార్యక్రమం శనివారం ముగిసింది. కార్యక్రమంలో భాగంగా శనివారం మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజును నాగమణి కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం పలు గ్రామాల్లో పరిచయ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అనంతవరం, పెంట, కొవ్వాడ, గంధవరం, తిమ్మాపురం, విజయరాంపురం, బిహెచ్.పురం, విక్.పాలెం, మద్ది, పద్మనాభం గ్రామాల్లో పర్యటించారు. భీమిలి అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేస్తున్నానని చెబుతూ, గ్రామాల్లో సమస్యలనడిగి తెలుసుకున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు అందరి ఆశీస్సులు కావాలని ఆమె కోరారు.



మాజీ మంత్రి అప్పలనర్సింహరాజును కలిసిన నాగమణి

గీతంలో ది హిడెన్ స్ప్రౌట్స్ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి-విశాఖపట్నం : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ది హిడెన్ స్ప్రౌట్స్‌కు చెందిన వికలాంగ బాలలు శనివారం సందడిచేశారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఈ నెల 10, 11 తేదీలలో నిర్వహించనున్న జాతీయ స్థాయి యువజనోత్సవం గీతం ఎక్సలెన్స్ మీట్ 2024లో భాగంగా నిర్వాహకులు వికలాంగ బాలల సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. మహిషాసుర మర్దిని, నరసింహ అవతార వంటి పురాణ ఘట్టాలను విద్యార్థులు ప్రదర్శించిన తీరు అబ్బుర పరిచింది. ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు హిడెన్ స్ప్రౌట్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులను అభినందించారు. గీతం ఎక్సలెన్స్ మీట్ 2024 ద్వారా సమకూరిన నిధులను ది హిడెన్ స్ప్రౌట్స్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జెమ్24 నిర్వహణ కమిటీ సిఇఒ ఇందుకూరి వర్మ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌లో నూతనోత్సాహం'

ప్రజాశక్తి-పెందుర్తి : వైఎస్.షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి రావడంతో కార్యకర్తల్లో నూతన ఉత్సాహం వచ్చిందని ఎపిసిసి కార్యదర్శి రుత్తల శ్రీరామ్‌మూర్తి తెలిపారు. పెందుర్తిలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నేటి నుంచి 60 రోజులు పాటు అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నిర్విరామంగా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో సాగిన విజయపరంపర త్వరలోనే ఆంధ్రాను తాకనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు శ్రీనివాస్, స్థానిక కాంగ్రెస్ నాయకులు షేక్ షఫీ ఉల్లా, విన్నకోటరాము, కొమ్మోజి లక్ష్మోజి, ముక్క రామునాయుడు, వెంకటరమణ, సబ్బవరం మండల అధ్యక్షులు రాము, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-వేపగుంట : విశాఖ ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ ఆర్థిక సహాయంతో యుటిఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి వంగ రామలక్ష్మి ఆధ్వర్యాన వేపగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 40 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయులు పద్మావతి పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎ.నరసింహామూర్తి, సహాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, కోశాధికారి అర్జునరావు, అప్పారావు, కె.గోవింద్, ఎన్.జోగారావు, వెంకటేశ్వరావు, ఎస్.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి- కరాస: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో మహిళ మృతి చెందిన ఘటన ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి ఎన్ఎడి కొత్త రోడ్డు వద్ద చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి స్థానికులు, కంచరపాలెం ట్రాఫిక్ సిఐ మళ్ల అప్పారావు కథనం ప్రకారం... మద్దిలపాలెం కృష్ణా కాలేజీ సమీపంలో నివాసముంటున్న శీలం నాగమణి (40) తన భర్త శ్రీనివాసరావుతో కలిసి పల్సర్ బైక్‌పై ఉదయం 6 గంటలకు రావులపాలెం బయలుదేరారు. ఎన్ఎడి జంక్షన్ వద్ద గాజువాక వైపు వెళ్లే బస్టాప్ బ్రిడ్జి సమీపంలో వెనుకనుంచి వచ్చిన లారీ పల్సర్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. వెనుక కూర్చున్న నాగమణి రోడ్డుపై పడిపోయింది. ఆమె తలపై నుంచి లారీ చక్రాలు వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త శ్రీనివాసరావు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కంచరపాలెం ట్రాఫిక్ సిఐ మళ్ల అప్పారావు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతి చెందిన నాగమణికి డిగ్రీ చదువుతున్న కుమారుడు మహేష్, లావణ్య ఉన్నారు. భర్త శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ మళ్ల అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -ఆనందపురం : గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వారిని ఆనందపురం విశాఖపట్నం జాతీయ రహదారి భీమిలి క్రాస్ రోడ్ వద్ద శనివారం పోలీసులు పట్టుకున్నారు. భీమిలి క్రాస్ రోడ్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. కోరాపుట్ నుంచి విశాఖపట్నం వైపు వస్తున్న కారును తనిఖీ చేయగా 5 కిలోల గంజాయి లభ్యమైంది. కారులో ఉన్న కోరాపుట్‌కు చెందిన శుభ పంగి (32), సంజీవ మారి (25), రమేష్ కుర్ర (24)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- బుచ్చెయ్యపేట : మండలంలోని పొట్టిదొరపాలెంలో అనారోగ్యంతో బాధపడుతూ ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు బుచ్చెయ్యపేట ఎస్ఐ, డి.ఈశ్వరరావు తెలిపారు. గ్రామానికి చెందిన నంబరు అప్పారావు (72) రెండు సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆరోగ్య సమస్యలను తట్టుకోలేక శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ మేరకు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కెజిబివిలో ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పద్మనాభం కస్తూరిబా గాంధీ బాలిక పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎంపిపి రాంబాబు శనివారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు వీటిని సక్రమంగా వినియోగించుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.లిల్లీ తదితరులు పాల్గొన్నారు.

నార్త్ జోన్ ట్రాఫిక్ సిఐగా కాంతారావు



ప్రజాశక్తి- మధురవాడ : నార్త్ జోన్ ట్రాఫిక్ సిఐగా ఎస్.కాంతారావు బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయనగరం సిసిఎస్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన వెంకట్రావు శ్రీకాకుళం దిశా పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ, నార్త్ జోన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రుషికొండ బీచ్‌రోడ్డు, మధురవాడ కూడలి, కొమ్మాది, కారుషెడ్ కూడలి, క్రికెట్ స్టేడియం కూడలి, ఆనందపురం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు జీబ్రా గీతలు, వేగ నియంత్రణ బోర్డుల ఏర్పాటుపై దృష్టి సారించినట్లు తెలిపారు.

స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్టూడెంట్స్ యునైటెడ్ నెట్ వర్క్ 2024 కేలండర్‌ను శనివారం విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్ వర్క్ అధ్యక్షులు రాజేటి బసవకృష్ణమూర్తి మాట్లాడుతూ, విద్యార్థుల్లో జాతీయ సమైక్యతను, దేశభక్తిని పెంపొందించేందుకు తమ సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జి.ప్రదీప్‌రాజు, కె.నరేష్, ఎస్.వి.రాజారెడ్డి, సుధాకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం : వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉత్తర నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. సామాజిక సాధికార యాత్ర నేపథ్యంలో బాలయ్యశాస్త్రి లే-అవుట్‌లోని వైసిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తర నియోజకవర్గంలో ఎన్నో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు మాట్లాడుతూ, విద్య, వైద్యం, వసతి, ఉపాధి, ఉద్యోగ కల్పనకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషిచేశారన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పాటయ్యాక నియోజకవర్గంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులకు రూ.3467.76 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో జూనియర్, డిగ్రీ కళాశాలలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కేలండర్ విడుదల

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్ర ఆరోగ్య విద్య ప్రచారణ అధికార్లు సమకూర్చిన 2024 కేలండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో శనివారం విడుదలచేశారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ, జిల్లాలోని ఆరోగ్య విద్య ప్రచారణ అధికారులు, విస్తరణ అధికారులు, ఆరోగ్య విద్యా బోధకులు అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై సరైన అవగాహన కలిగేటట్లు ప్రధాన భూమికను పోషిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వరరావు ప్రసాద్, బి.నాగేశ్వరరావు, డెమో, ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి-వేపగుంట : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యాన ఈ నెల 2వ తేదీ నుంచి నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎన్‌టిపిసి విశ్రాంత జనరల్ మేనేజర్ పి.శివరామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎమర్జింగ్ ట్రెండ్ ఇన్ పవర్ సెక్టార్‌పై విద్యార్థుల్లో పెంపొందించాల్సిన జ్ఞానం గురించి ఉపాధ్యాయులకు వివరించారు. ఎయు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సీనియర్ ఇంజినీర్ కె.కార్తీక్‌వర్మ మాట్లాడుతూ, రోబోటిక్స్ ప్రస్తుతం ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. కుకు ప్రో సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీధర్‌పట్నాయక్, వైఎస్ ప్రిన్సిపల్ బి.జీవన్‌రావు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.సత్యనారాయణ పాల్గొన్నారు. ఐదు రోజుల ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పివివి.సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించారు.

ఆళ్ల పైడిరాజును అభినందించిన జియ్యాని

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి కొత్తపాలెం కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన ఆళ్ల పైడిరాజును డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అభినందించారు. సాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, కో-ఆపరేటివ్ బ్యాంక్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశాఖ మార్కెటింగ్ శాఖ అధ్యక్షులు ఆల్ఫా కృష్ణ, అడవివరం కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ గేదెల మురళీకృష్ణ, వైసిపి నగర కార్యదర్శి గవర నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : స్థానిక కుమారి కల్యాణ మండపంలో శనివారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విజేతలకు జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 91, 92 వార్డుల వైసిపి అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, జి.అప్పలస్వామినాయుడు, నాయకులు గేదెల మురళీకృష్ణ, బురెడ్డి గోపి, చుక్క పైడిరాజురెడ్డి, కంపర సత్తిబాబు, బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న బెహరా భాస్కరరావు

మున్సిపల్ కార్మికులపై పోలీసుల కర్కశం

జివిఎంసి పరిధిలో 400 మంది అరెస్ట్
ఎక్కడికక్కడ నిర్బంధంపై మండిపడ్డ వర్కర్లు



ఆర్‌కెఎస్‌వి.కుమార్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికుల సమ్మె విశాఖలో 12వ రోజుకు చేరుకుంది. శనివారం జివిఎంసి ముట్టడికి యత్నించిన కార్మికులపై ప్రభుత్వం తీవ్ర పోలీసు నిర్బంధం ప్రయోగించింది. నగరంలోని అన్నిచోట్లా కలిపి 400 మందిని పోలీసులు అరెస్టు చేశారు. తొలుత మున్సిపల్ నాయకులు, కార్మికులు జగదాంబ జంక్షన్ నుంచి ఒక ప్రదర్శనగానూ, అశీలమెట్ట జివిఎంసి జోన్ త్రీ కార్యాలయం నుంచి మరో ప్రదర్శనగానూ, టిఎస్‌ఆర్ కాంప్లెక్స్ నుంచి ఇంకో ప్రదర్శనగానూ, పందిమెట్ట మలేరియా కార్యాలయం నుంచి ఒక ప్రదర్శనగానూ మున్సిపల్ ఆఫీసుకు రాసాగారు. వారందరినీ పోలీసులు అరెస్టు చేసి పలు స్టేషన్లకు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు వి.కృష్ణారావు, ఈశ్వరరావు, ఎంవి.ప్రసాదరావు, గణేష్, కె.కుమారి, ఆర్.శ్రీను, ఎస్.శ్రావణ్‌కుమార్, జగదీశ్వరి, కొండమ్మ, బేబి, వాటర్ సప్లై యూనియన్ నాయకులు వెంకటరావు, మహేశ్వరి తదితరులు ఉన్నారు. వాస్తవానికి శనివారం ఉదయం నుంచే పలువురు నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి, కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులపై పోలీసు నిర్బంధం ఆపాలన్నారు. సమ్మె డిమాండ్లు పరిష్కరించకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా దిగొచ్చి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అక్రమ అరెస్టులను జగ్గునాయుడు ఖండించారు.

భీమునిపట్నం: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అధికారులు చేసిన ప్రయత్నాన్ని కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టారు. స్థానిక జివిఎంసి యుపి పాఠశాల వద్ద ఉన్న చెత్త తరలించేందుకు వాహనం వెళ్తుండగా పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జివిఎంసి ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి జోన్ గౌరవాధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు



మధురవాడలో వాహనాన్ని అడ్డుకుంటున్న కార్మికులు

34 మంది అరెస్టు

మధురవాడ : మారికవలస, మధురవాడ జోనల్ కార్యాలయం ప్రాంతాల్లో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు 34 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కె.నాగరాజు, వి.సంధ్య, ఎ.నరేంద్ర, జి.లలిత, బి.రూప, ఎం.సుశీలమ్మ, ఎస్.రాము, కె.దేవుడు, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎస్.చిన్న తదితరులు ఉన్నారు. ఈ



గాజువాకలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

సందర్భంగా యూనియన్ నాయకులు ఎస్.రామప్పడు, సిహెచ్ శేషుబాబు మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి కార్మికులతో చర్చలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.కిరణ్, పి.జాన్, బి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : అక్రమ అరెస్టులను ఖండిస్తూ జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన చినగంట్యాడ, గాజువాక సిఐటియు కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గొలగాని అప్పారావు, ఎన్.నాగరాజు, కె.కిరీటం, వై.చిన్నారావు, కుమారి, పెంటారావు, క్లాప్ వాహన డైవర్లు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌తో వాగ్వాదం చేస్తున్న కార్మికులు

చెత్త వాహనాల అడ్డగింత

అనకాపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికుల సమ్మె 12వ రోజుకు చేరింది. జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం ముందు శనివారం నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ నేపథ్యంలో జివిఎంసి జోనల్ కమిషనర్ వెంకటరమణ ఆధ్వర్యాన చెత్త తొలగించేందుకు వాహనాలను తీసే ప్రయత్నం చేయగా, వాటిని కార్మికులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఇప్పటికైనా తమ సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బొమ్మాల రాము, నిమ్మకాయల అజయ్, సంతోష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన

నర్సీపట్నం టౌన్: పట్టణంలో మున్సిపల్ కార్మికులు 12వ రోజు సమ్మెలో భాగంగా భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి, ఈశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు గత 12 రోజుల నుండి తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని నిరసన చేపడుతున్నా ప్రభుత్వం స్పందించలేదన్నారు. తక్షణమే పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్‌లో పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలన్నారు. కరోనా సమయంలో పనిచేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భీమిలిలో చెత్త వాహనం వెళ్లకుండా అడ్డుకుంటున్న పారిశధ్య కార్మికులు



నర్సీపట్నంలో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

'ఉత్తరం'లో సామాజిక సాధికార యాత్ర

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ పరిధి పోర్టు ఆసుపత్రి వద్ద శనివారం సామాజిక సాధికార బస్సు యాత్రను సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో పేదరికం 12 శాతం ఉంటే జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆరు శాతానికి వచ్చిందని తెలిపారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా నేరుగా అర్హులైన లబ్ధిదారులకు పథకాలను అందజేస్తున్నట్లు చెప్పారు. మేయర్ హరి వెంకటకుమారి మాట్లాడుతూ, చట్టసభల్లో అన్ని కులాలకు ముఖ్యమంత్రి ప్రాధాన్యత ఇస్తున్నారనానరు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, పెట్ల ఉమాశంకర్‌గణేష్, తిప్పల నాగిరెడ్డి, గొల్ల బాబూరావు, కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



సామాజిక సాధికార యాత్రను ప్రారంభిస్తున్న వైవి.సుబ్బారెడ్డి

ఎపి భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అనకాపల్లి

రైతులు, ప్రజల ఆస్తులకు నష్టం కలిగించే ఏపీ భూహక్కుల చట్టాన్ని రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక దొడ్డి రామానాయుడు భవనంలో సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అధ్యక్షతన శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనకాపల్లి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎస్ఎస్వి.లక్ష్మణరావు, ఎంజేఎన్.కుమార్, రైతు సంఘం జిల్లా కోశాధికారి జి.నాయనబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ చీకటి చట్టాన్ని 2022 సెప్టెంబర్ నెలలో రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించి రాష్ట్రపతికి పంపారని, రాష్ట్రపతి 2023 అక్టోబర్‌లో ఆమోదించిన చట్టం చేయడం జరిగిందని తెలిపారు. ఈ చట్టాన్ని కార్పొరేట్‌ల ప్రయోజనాలు కోసం చేసారన్నారు. ఇది అమల్లోకి వస్తే పేదలు భూములు కోల్పోయే ప్రమాదం ఉందని, భూ వివాదాలు పెద్ద ఎత్తున పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి వివాదాలు పరిష్కరించడం కోసం రెవెన్యూలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తారని, అక్కడ పరిష్కారం కాకపోయినా సివిల్ కోర్టుకు వెళ్ళే అవకాశం లేదని, దీని వల్ల వివాదాలు పరిష్కారం కాకుండా, పేద రైతులకు భూములపై హక్కులు లేకుండా చేసి అదానీ, అంబానీ లకు లక్షల ఎకరాలు కట్టబెట్టడం కొరకు ఈ చట్టం చేసారన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అప్పారావు

ఈ చట్టం రద్దు చేసే వరకూ రైతు సంఘాలు, న్యాయ వాదులు రైతులను కలుపుకుని పోరాటం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, న్యాయ వాదులు గంగాధర్, జీ.సురేష్, మాధవరావు, సురేష్, నాయకులు బొడ్డేడ అప్పారావు, కె.శంకరావు, భూసిరాజు, బి.రంగారావు, తేలయ్యబాబు, బి.రంగారావు, ఏ.మహేశ్వరరావు, కె.సత్యనారాయణ, ఎస్. నారాయణ మూర్తి, పాల్గొన్నారు.



ప్రజలతో దిలీప్‌కుమార్

గ్రామాల్లో దిలీప్ చక్రవర్తి పర్యటన

ప్రజాశక్తి-అచ్యుతాపురం

టిడిపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నిస్తున్న బైరా దిలీప్ చక్రవర్తి శనివారం అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఉప్పవరం గ్రామంలో టిడిపి కార్యకర్తలతో ఆయన సమావేశమై మాట్లాడారు కార్యకర్తలు సేవలు ఎన్నటికీ మర్చిపోనివని చెప్పారు. నిరంతరం సేవలందిస్తానని ఆయన కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. తనను ఆదరించి రానున్న ఎన్నికలలో టిడిపి ఎంపీ అభ్యర్థిగా తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సమావేశంలో ఉప్పవరం గ్రామ ఉపసర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు, కరెడ్ల ప్రకాష్, సేనాపతి వెంకటేష్, కొలగాని శేషు, టిడిపి జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

సిసి రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట ఇంద్రమ్మ కాలనీలో అనకాపల్లి ఎంపీ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డును రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి శనివారం ప్రారంభించారు. అలాగే కసింకోట మండలంలో వివిధ గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కోసం ఎంపీ నిధులు రూ.22.13 లక్షలతో చేతి బోరులు, శ్మశాన వాటికలో నీటి సదుపాయం కొరకు రూ.9 లక్షలతో చేతి బోర్లు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు, ఎంపిడిఓ రవి కుమార్, సర్పంచ్ జయరజిని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, పెంటకోట శ్రీను, మలసాల కిషోర్ అధికారులు పాల్గొన్నారు

వృద్ధులకు అన్ని రైళ్లలో రాయితీలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : వృద్ధులకు అన్ని రైలు టికెట్‌ల్లో రాయితీలను పునరుద్ధరించాలని కోరుతూ స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చ రల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో శనివారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా రైల్వే స్టేషన్ ముఖ ద్వారం ఆవరణలో రైల్వే ప్రయాణికులతో కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం రైల్వే స్టేషన్ ప్రధాన కార్యాలయంలో రైల్వే స్టేషన్ మేనేజర్ చౌహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వినకోట నీలేశ్ గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణ మోహన్, కొత్తూర్తి రామారావు, బొడ్డు సోమరాజు, బుద్దిస్ట్ సొసైటీ జిల్లా అధ్యక్షులు నేలపూడి బాల రాజు, సీనియర్ సిటిజన్స్ కె.నారాయణరావు, వై.ఆదినారాయణ పాల్గొన్నారు.

దాబాల ఆవరణలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : డాబాలు, రెస్టారెంట్ల ఆవరణలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని అచ్యుతాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.బుచ్చిరాజు సూచించారు. అచ్చుతాపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం రాత్రి దాబా రెస్టారెంట్ యజమానులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన సమయాలకు దాబా, రెస్టారెంట్లను మూసివేయాలన్నారు. మత్తు పానీయాలను అనుమతించరాదని, మద్యం అనుమతి లేదని నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దాబాల ఎదుట వాహనాలు నిలుపుకోవడానికి అనుకూలంగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సూరిశెట్టి కన్నారావు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

నిద్రిస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె 18వ రోజుకు చేరింది. శుక్రవారం సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయ ముట్టడికి అనకాపల్లి జిల్లా నుండి వెళ్లిన సమగ్ర శిక్ష ఉద్యోగులు, అక్కడ నుండి రాత్రి బయలుదేరి శనివారం ఉదయం నేరుగా కొప్పాక వద్ద జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద దీక్షా శిబిరానికి చేరుకొని నిరసన కొనసాగించారు. రాత్రంతా నిద్రలేమితో వచ్చిన వీరంతా దీక్షా శిబిరంలో నిద్రిస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వంతో చర్చలు సఫలం అవ్వాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సంఘం గౌరవ అధ్యక్షులు పూడి వెంకట్రావు, సెక్రటరీ నాగేశ్వరరావు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అచ్యుత కృష్ణ, నాయకులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.



శిబిరంలో నిద్రిస్తూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఉత్తరాంధ్ర వైసీపీ నేతలు రాజీనామా చేయాలి



దాడి వీరభద్రరావును సత్కరిస్తున్న బివి.రామ్

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్రకు చెందిన వైసిపి నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి బయటికి రాకపోతే ఉత్తరాంధ్ర ద్రోహులుగా చరిత్రలో నిలిచిపోతారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన దాడి వీరభద్రరావును అనకాపల్లిలోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరభద్రరావును సత్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలోకి దాడి కుటుంబం రావడం శుభ పరిణామమన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు రాబోయే ఎన్నికలలో ఎమ్మెల్యే టికెట్ దక్కదని దాదాపుగా ఖరారైన పరిస్థితులలో, ఏ ఒక్క వైసీపీ నాయకుడు ఆయనకు అనుకూలంగా మాట్లాడడం లేదన్నారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా ఉన్న ఆయన విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణతో సహా, నూతన పరిశ్రమలు తేవడంలో పూర్తిగా విఫలమైనట్లు చెప్పారు. గుడివాడ అమర్‌కు బొడ్డేటి ప్రసాద్ లాంటి బినామీలు చాలామంది ఉన్నారని, వారందరూ టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత జైలులోకి వెళ్లడం ఖాయమన్నారు. దాడి వీరభద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో మద్దాల కృష్ణ, బొలినేని వెంకటేశ్వరరావు, డొక్కా నాగభూషణం, దాడి ముసలి నాయుడు, దాడి అభిమానులు పాల్గొన్నారు.

క్లౌడ్ ఫౌండేషన్, ఆపరేషన్ కోర్సులపై వర్క్ షాప్

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'అమెజాన్' వెబ్ సర్వీసెస్ నిర్వహించిన వర్క్షాప్ శనివారంతో ముగిసింది. వారం రోజుల పాటు సిఎస్ఎం విద్యార్థులకు జరిగిన ఈ వర్క్శాపులో క్లౌడ్ ఫౌండేషన్, క్లౌడ్ ఆపరేషన్ కోర్సుపై అవగాహన పెంచుకున్నారని సిఎస్ఎం విభాగాధిపతి అడపా వెంకటేశ్వరావు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ ఈ సర్టిఫికేషన్ కోర్స్ వారి భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రిసోర్స్ పర్సన్స్ "అమెజాన్" వెబ్ సర్వీసెస్‌లోని లోడ్ బ్యాలెన్సింగ్, వెబ్సైటు హోస్టింగ్, క్రియేషన్ అఫ్ డేటాబేస్ వంటి వివిధ సాంకేతికతనీ నేర్పించామని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



జయశ్రీని అభినందిస్తున్న డైట్ అధ్యాపకులు

తైక్వాండో పోటీల్లో డైట్ విద్యార్థినికి స్వర్ణ పతకం

ప్రజాశక్తి- అనకాపల్లి

విజయవాడలో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో పోటీలలో డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం మొదటి సంవత్సరం విద్యార్థి యు.జయశ్రీ సీనియర్స్ 57కేజీ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ మేరకు జయశ్రీ స్వర్ణ పతకం సాధించడం పట్ల కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠ రావు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ కె.పార్వతి, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎ.కృష్ణనాగ్, ప్రోజెక్ట్ ఇంజినీర్ బి.శేషగిరిరావు, ఫిజికల్ డైరెక్టర్ బిసిహెచ్ శ్రీనివాసరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.


మెగా వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి -మునగపాక

మండలంలోని తోటాడ గ్రామ డెయిరీ ఫామ్ ఆవరణలో శనివారం ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సాయి సందీప్ (లండన్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ దొడ్డి మంగవేణి ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసం సందీప్ తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, నాయకులు దొడ్డి కోటేశ్వరరావు, షేక్ ఇస్మాయిల్, వార్డు సభ్యులు బుద్ధ రమేష్ నాయుడు, మహాలక్ష్మి నాయుడు, పొలమరశెట్టి జగదీష్ బాబు, సరిసా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం


రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల రక్తదానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం మండల విద్యా వనరుల కేంద్రంలో శనివారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గాజువాక అమ్మ బ్లడ్ సెంటర్ రక్తాన్ని సేకరించారు. 25 మంది ఉపాధ్యాయులు, యువకులు రక్త దానం చేశారు. ఈ శిబిరాన్ని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్తితో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సిఆర్‌కె.దేవరాయలు, ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి వెంకటపతి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్, నాయకులు ఎన్.వి సూర్యనారాయణ, పట్నాల నాగేశ్వరరావు, ఎం.నరసింహమూర్తి, సరళ దేవి, ఫాతిమా మోబిన్, ప్రోత్సాహిని సత్యనారాయణ, నక్కా అప్పల నాయుడు, రెడ్డి కృష్ణ, శాస్త్రి, రామశర్మ, నిజాముద్దీన్, సోము నాయుడు, అర్జున్ రావు, నాయుడు, తీగల శివాజీ, ఆనంద్ పాల్గొన్నారు.

నేడు గున్నెంపూడిలో రైతు గర్జన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : చోడవరం నియోజకవర్గంలో అత్యంత ఇబ్బందుల్లో ఉన్న రైతుల సమస్యల పరిష్కారం కోసం ఆదివారం గున్నెంపూడిలో జరుగు రైతు గర్జన సభను విజయవంతం చేయాలని జనసేన చోడవరం నియోజకవర్గ ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజు శనివారం తెలిపారు. వైసీపీ సర్కార్ రైతు సమస్యలను పరిష్కరించకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. నియోజకవర్గంలో గల నాయకులు కార్యకర్తలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పోలేపల్లి గ్రామంలో శనివారం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎడ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు జోగా కొండబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దళిత, గిరిజన, బలహీన వర్గాల వ్యతిరేకి మోడీ

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం పేదలకు, దళిత, గిరిజన, బలహీన వర్గాలకు వ్యతిరేకమైన విధానాలు అమలుచేస్తుందని, ప్రజల మధ్యన విద్వేషాలను రగిలిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి నియోజకవర్గం కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు, న్యాయవాది ఐ.ఆర్.గంగాధర్ అన్నారు. శనివారం అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగ స్ఫూర్తిని, విలువలను నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగ వ్యవస్థలను బలహీన పరుస్తోందని ఆరోపించారు. బిజేపీ పాలన కొనసాగితే భారత రాజ్యాంగం అస్తిత్వమే కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు బిజేపీ విధానాలకు అండగా నిలవడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కార్యదర్శి కొల్లి సత్యారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి సంతోష్, బిసి హక్కుల సంఘం నాయకులు వీరేశ్వరపు రాంప్రసాద్ మాట్లాడారు.

ఎమ్మెల్యే ధర్మశ్రీ ప్రకటనలు మోసపూరితం

ప్రజాశక్తి-వడ్డాది : చోడవరం నియోజకవర్గం అభివృద్ధిపై స్థానిక శాసన సభ్యులు కరణం ధర్మశ్రీ చేస్తున్న ప్రకటనలు మోసపూరితమైనవని టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ధర్మశ్రీ అసమర్థత వలనే బిఎన్ రోడ్డు అభివృద్ధి పనులు ఏళ్ల తరబడి సాగుతున్నాయని ఆరోపించారు. చెరకు బకాయిలకు రూ.12.5కోట్లు తమ ప్రభుత్వం నుంచి గ్రాంటుగా మంజూరు చేయించినట్లు మూడు నెలలుగా ధర్మశ్రీ తప్పుడు ప్రకటనలతో రైతులను మోసగిస్తున్నారని తెలిపారు.

30 రోజులూ పని కల్పించాలి

అభిజిత్ పరిశ్రమ గేటు వద్ద సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అభిజిత్ పరిశ్రమ కార్మికులకు పాత పద్ధతిలో నెలరోజులపాటు పని కల్పించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో నాలుగో రోజు శనివారం పరిశ్రమ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనకు జనసేన, తెలుగుదేశం పార్టీల ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జులు సుందరపు విజయకుమార్, ప్రగడ నాగేశ్వరరావు, సిపిఎం కన్వీనర్ ఆర్ రాము తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆర్.రాము మాట్లాడుతూ అభిజిత్ పరిశ్రమ అభివృద్ధికి తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికులకు పరిశ్రమ యాజమాన్యం పని దినాలను తగ్గించడం అన్యాయమన్నారు. నెలకు 20 రోజులు మాత్రమే విధులకు రావాలని యాజమాన్యం ప్రకటించడం చట్టవి రుద్దమని పేర్కొన్నారు. కార్మికులకు ఇచ్చే అరకొర కూలితో యాజమాన్యం చెప్పినట్లు 20 రోజులు పని చేస్తే కుటుంబాలను పోషించడం చాలా కష్ట సాధ్యమన్నారు. కార్మికులకు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకొని ప్రతి నెల 30 రోజులపాటు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె.సోమునాయుడు, అభిజిత్ కార్మికులు శ్రీను, రాంబాబు, చక్రధర్, రాజు పాల్గొన్నారు.


కంపెనీ గేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

300 రైతు కుటుంబాలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం, పెద గంగవరం గ్రామానికి చెందిన 300 రైతు కుటుంబాలకు న్యాయం చేయాలని ఆ గ్రామానికి చెందిన శ్రీరామ రైతు సంక్షేమ సంఘం నాయకులు, రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేవరాపల్లి మండల కేంద్రానికి సమీపంలో ఉన్న పెదగంగవరంలో శనివారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 1847 నుంచి పెదగంగవరంలో నివాసమున్నాము, అక్కడ భూములపై సర్వహక్కులు కలిగి ఉన్నామని, అయినా తాము గిరిజనేతరులమంటూ 1/70 చట్టం పేరుతో తమకు దక్కవలసినవి దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అనేకమంది రైతులు సాగు భూములను వదిలి, వలసబాట పట్టారన్నారు. తమ హక్కులను కోల్పోతున్నామన్న భయంతో లక్షలాది రూపాయలు వెచ్చించి కోర్టుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగడం తప్ప తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి తమ ఆధారాలను పరిశీలించి 300 రైతు కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు కోటాన వెంకటరమణ, కోటాన అక్కునాయుడు, తోట దేముడు, కొట్టాన రాము, మిడతాడ శ్రీను, ద్వారపురెడ్డి అప్పలనాయుడు, గవిరెడ్డి దేవుళ్ళు, రైతులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

బెల్లం ఆధారిత ఉత్పత్తులతో ఆదాయం

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్ర, శని రెండు రోజులపాటు ఆత్మ ప్రాజెక్టు సహకారంతో బెల్లంతో విలువ ఆధారిత ఉత్పత్తుల పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్ఏఆర్ఎస్ పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికె జగన్నాథరావు మాట్లాడుతూ బెల్లంతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారీ ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. ఇందుకు కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆర్ ఏ ఆర్ ఎస్ అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బెల్లంతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనకాపల్లి, మునగపాక, వాడ్రపల్లికి చెందిన 30 మంది మహిళ రైతులతో పాటు ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆశా దేవి, ఆర్ ఏ ఆర్ ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ డి ఆదిలక్ష్మి, డాక్టర్ శ్రీదేవి, కోర్స్ డైరెక్టర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

వైసిపి అరాచక పాలనకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : రాష్ట్రంలోని వైసిపి అరాచక పాలనకు స్వస్తి పలకాలని, మన రాష్ట్రాన్ని ఈ సైకో పాలన నుండి కాపాడుకోవడానికి ప్రజలందరూ ముందుకు రావాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. జగన్ రెడ్డి అవినీతి అక్రమాల నుండి తుద ముట్టించేందుకు మన అందరి బాధ్యత అని రా కదిలి రా తెలుగుదేశం పార్టీ అధినేత జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు ప్రజలను చైతన్య పరచడానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరల ముఖ్యమంత్రి పదవి చేపట్టడానికి ముఖ్యమంత్రి అనేక కుట్రలో కుతంత్రాలతో సోషల్ మీడియాని ఉపయోగించుకుంటుందని చెప్పారు. పోలీసులను అడ్డం పెట్టుకొని బాధితులపైనే తిరిగి అక్రమ కేసులు బనాయిస్తున్నారని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలు దగాపడ్డారని నాగ జగదీశ్ ఆవేదన వ్యక్తపరిచారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు తేడా లేకుండా పిల్ల సైకోలు కబ్జాలు చేస్తున్నారని, దీనికి సిఐడి అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. నాడు ఎన్టీఆర్ పిలిపిచ్చిన రా కదలిరా తెలుగుదేశం పిలుస్తుంది, మరలా చంద్రబాబు రా కదిలిరా అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలో చేపట్టారని, కనిగిరి సభలో వైసిపి ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనపడిందని, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని నాగ జగదీష్ అన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాడుగుల నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఈ నాగలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని సూదివలస, పాతవలస గ్రామాల్లో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, సర్పంచ్ ఆదిరెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు, అప్పలకొండ కుమార్ పాల్గొన్నారు.

డావిన్సీలో ఘనంగా 4కె రన్

ప్రజాశక్తి-అచ్యుతాపురం : తిమ్మరాజుపేట డావిన్సీ అంతర్జాతీయ పాఠశాల నిర్వహిస్తున్న క్రీడోత్సవాలలో భాగంగా శనివారం చొడపల్లిలో హనీ అపార్ట్మెంట్ ఎదురుగా విశాలమైన రోడ్లలో ఫోర్ కె రన్ ఏర్పాటు చేశారు. స్థానిక ఎంపిపి కోన సంధ్యారాణి, డావిన్సీ అంతర్జాతీయ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ కర్రి సుందరయ్య, డైరెక్టర్ జె.రమణాజి చేతుల మీదుగా నాలుగు హౌసెస్‌కి ఏర్పాటు చేసిన రన్‌లో విద్యార్థులు అద్వితీయమైన ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. బాలుర విభాగంలో మొదటి స్థానంలో సాగర్ (ఆరెంజ్ హౌస్) రెండోవ స్థానంలో పార్థు (గ్రీన్ హౌస్) మూడవ స్థానంలో ఆదిత్య (ఆరంజ్ హౌస్) బాలికల విభాగంలో మొదటి స్థానంలో ఆనంది (బ్లూ హౌస్,) రెండవ స్థానంలో నిహారిక (ఆరంజ్ హౌస్)మూడవ స్థానంలో చార్మి (గ్రీన్ హౌస్) స్థానాలను కైవసం చేసుకున్నారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ సుందరయ్య డైరెక్టర్ రమణాజి ప్రిన్సిపల్ మీనా మిశ్రా , డీన్ సూరిబాబు , అభినందించారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సంఘం మహాసభలకు తరలిరావాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఈనెల 8, 9,10 తేదీల్లో రాజమండ్రిలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలకు అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చి జయప్రదం చేయాలని చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్వీర్యం చేస్తుందన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాలేక అప్పులు తీర్చలేక అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి గొర్లె దేవుడు బాబు , రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

8న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల నిరాహార దీక్ష

ప్రజాశక్తి-చోడవరం : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8వ తేదీన విద్యుత్ శాఖ ఎస్ఇ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేస్తున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ తెలిపారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ దీక్షల్లో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కె.భాస్కరరావు, రీజనల్ ప్రెసిడెంట్ ప్రేమ చంద్రశేఖర్, డివిజన్ ప్రెసిడెంట్ కె.నాగపురావు, కార్యదర్శి కలిమి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని లంకెలపాలెం, జివిఎంసి 79వ వార్డు పరిధిని రెండు శ్మశాన వాటికలలో జివిఎంసి నిధులు కోటి 91 లక్షల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పరిశీలించారు. పనులు వేగంగా జరిపించాలని కాంట్రాక్టర్‌ను, అధికారులను ఆదేశించారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

హామీ మేరకు పింఛన్ల పెంపు




మాకవరపాలెంలో పింఛను ఇస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:సీఎం జగన్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. శనివారం పెదబొడ్డేపల్లి సచివాలయం వద్ద వైయస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పింఛన్‌ను 3వేలకు పెంచుకుంటూ పోతానని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ ప్రకారం 3వేల పింఛన్లు పెంచడం జరిగిందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. అనంతరం పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వైసిపి మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, కౌన్సిలర్లు మాకిరెడ్డి బుల్లిదొర, 15వార్డు ఇంచార్జ్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

గొలుగొండ:వైసిపి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు అన్నారు. శనివారం సిహెచ్.నాగాపురం, కృష్ణదేవిపేట, ఏఎల్ పురం, లింగంపేట, జోగంపేట తదితర గ్రామాల్లో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయా గ్రామాల సర్పంచులు లబ్ధిదారులకు అందజేశారు. ఏఎల్‌పురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అర్హత ఒక్కటే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. మండలంలో కొత్తగా మంజూరైన 104 పింఛన్లను గ్రామంలో లబ్ధిదారులకు స్థానిక ప్రజా ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు లోచల సుజాత, ఎలమంచిలి రఘురాంచంద్రరావు, పందిరి సత్యంనాయుడు, తోకల సంతోష్ కుమార్, ఎంపిటిసిలు చింతల బుల్లి ప్రసాద్, గొంతిన మహాలక్ష్మి పాల్గొన్నారు.

మాకవరపాలెం:పెన్షన్ పెంపు పై సిఎం జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. శనివారం మాకవరపాలెం మండల పరిషత్ కార్యాలయంలో వైయస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ ను 3వేలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు రుత్తల వాసు , జెడ్పీటీసీ పెట్ల సత్యవేణి, ఎంపిడిఒ సీతామహాలక్ష్మీ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.



పెందుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

-కశింకోట : ప్రభుత్వం పెంచిన పింఛన్లను శనివారం కశింకోటలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి మలసాల భరత్ కుమార్, వైసిపి నాయకులు డాక్టరు కే.విష్ణుమూర్తి, మళ్ళ బుల్లిబాబు, దంతులూరి దిలిప్ కుమార్, గొల్లవిల్లీ శ్రీను, ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ నాయుడు, గోర్లి సూరిబాబు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, సర్పంచ్ జయరజనీ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు : అదీప్‌రాజు

వేపగుంట : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా భావిస్తూ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రగతి పథంలో నడిపిస్తున్నారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు చెప్పారు. జోన్-8 కార్యాలయంలో శనివారం పెంచిన పెన్షన్లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎన్నో పథకాలను అందిస్తున్నారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను పెంచుకుంటూ నేడు రూ.3000 చొప్పున అందిస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి వాలంటీర్లు పింఛన్లు అందిస్తున్నారని, అంటువంటి వాలంటీర్ వ్యవస్థపై పవన్‌కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలు సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో 94వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి ఆదిరెడ్డి మురళి, అధ్యక్షుడు తామర్ల నర్సింగరావు, 93వ వార్డు ఇన్‌ఛార్జి దాసరి అన్నపూర్ణ, పార్టీ వార్డు అధ్యక్షుడు బండి సత్తిబాబు, నాయకులు ఎం.మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పిఎం పాలెం : జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం.పాలెం అవంతి ఫంక్షన్ హాల్‌లో జరిగిన వైఎస్ఆర్ పింఛన్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, చరిత్రలో నిలిచిపోయేలా సంక్షేమ పథకాలను అందించిన గొప్ప నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నేడు పెరిగిన పింఛన్లతో అవ్వా, తాతలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, 6వ వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంక, అవంతి కళాశాలల డైరెక్టర్ శ్రవణ్, నాయకులు బొట్ట అప్పలరాజు, గాదె రోశి రెడ్డి, పోతిన ఏళ్ళాజి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి రావికమతం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న క్షేత్రస్థాయి ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు పెంచాలని మండల ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం గౌరవ అధ్యక్షులు దాసరి వరహాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఒక్క రూపాయి జీతం కూడా పెంచలేదన్నారు. ఉద్యోగ భద్రత కూడా కల్పించలేదని, కాంట్రాక్టు, అవుట్ అవుట్సోర్సు పద్ధతిలో పనిచేస్తున్న వారందరినీ క్రమబద్ధీకరిస్తానని ఆనాడు పాదయాత్రలో చెప్పిన మాట విస్మరించారని విమర్శించారు.గత తెలుగుదేశం ప్రభుత్వంలో రెండు మార్లు జీతభత్యాలు పెంచిన పరిస్థితులు ఉన్నాయన్నారు. గత 15 ఏళ్ల నుంచి అరకొర గౌరవ వేతనంతో పనిచేస్తున్న తమను ఆదుకోవాలన్న ఆలోచన పాలకులు, అధికారుల్లో లేక పోవడం బాధాకరమన్నారు.దీనినే నమ్ముకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న తమకు పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మండల ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం అధ్యక్షులు గణేష్, కార్యదర్శి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

శారద ట్రస్ట్ కేలండర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో అంబేద్కర్ పార్క్ ప్రాంగణంలో శారద ట్రస్ట్, శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కేలండర్లను మండల ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి సురేష్, మోహనరావులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో బాల్య వివాహాలు అరికట్టేందుకు, మెరుగైన వైద్యం, విద్య అందించేందుకు, గ్రావిటీ పథకాలు ఏర్పాటు చేసేందుకు శారద ట్రస్టు కృషి చేస్తుందన్నారు. గిరిజన ప్రాంతంలో శారద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు ఏర్పాటు చేసి పేద నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తుందని హర్షం వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి-గొలుగొండ:ప్రకృతి వ్యవసాయ పద్ధతులను సకాలంలో పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను సాగు చేయవచ్చని బిసిటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని గింజర్తి జంక్షన్‌లోని పెట్ల నారాయణమూర్తి పొలంలో, బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యమ్రకం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా గొలుగొండ మండల రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలోని తొమ్మిది ప్రాథమిక సూత్రాలను ఖచ్చితంగా పాటించడం ద్వారా రైతుకు పెద్దగా పెట్టుబడి ఖర్చు లేకుండానే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని సేద్య శాస్త్రవేత్త డాక్టర్ వాన ప్రసాదరావు అన్నారు. వ్యవసాయంలో నాటు ఆవు ప్రాధాన్యతను వివరిస్తూనే, సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ప్రాధాన్యాన్ని తెలియజేశారు. చీడపీడలు పంటలకు సోకినప్పటికీ ఆదాయంలో నష్టం లేకుండా ఉండే విధంగా, సమీకృత వ్యవసాయ విధానాలు పాటించాలని వాటి గురించి వివరించారు. జీవామృతం, కషాయాల తయారీ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో 40 మంది రైతులతో పాటు అభ్యుదయ రైతులు పోలిరెడ్డి రాజబాబు, ప్రకృతి వ్యవసాయ రైతులు గొర్లి సత్యనారాయణ, నారాయణమూర్తి, లగుడు రాజశేఖర్, సడ్డ మల్లేష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

అనర్హులకు పథకాలు

ప్రజాశక్తి-గొలుగొండ:అర్హులందరికీ సంక్షేమ పథకాలని చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వంలో మండలంలో ఏకైక మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో స్థానిక నాయకులు సంక్షేమ పథకాలను అర్హత లేని వారికి కట్టబెడుతున్నారని గొలుగొండ మాజీ జడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ ఆరోపించారు. శనివారం అల్లూరి పార్కులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏఎల్ పురంలో ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాలు, రైతు భరోసా సంక్షేమ పథకాలను అనర్హులకు నాయకులు కట్ట బెట్టారన్నారు. స్థానికంగా లేని వారికి, గతంలో ఇళ్ల స్థలాలు పొందిన వారికి ధనవంతులకి ఇళ్ల స్థలాల కేటాయించారని ఆయన ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే విచారణ సమయంలో నాయకులతో అధికారులకు కుమ్మక్కై ఆధారాలు చూపించినప్పటికీ నీరు కార్చారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం గ్రామంలో 273 ఇళ్లు మంజూరు చేయగా వాటిలో 2వ అంతస్తు కట్టిన వారికి, గతంలో లబ్ధిపొందిన వారికి నాయకులు చోటు కల్పించారన్నారు. సెంటు భూమి కూడా సాగు చేయని వైసీపీ కార్యకర్తలకు, నాయకులు కౌలు పత్రాలను చేయించి రైతు భరోసా పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తున్నారని ఆయన ఆరోపించారు. నిజమైన రైతుకు అందాల్సిన రైతు భరోసాను ప్రభుత్వాన్ని మోసగించి సొంత ప్రయోజనాలకు నాయకులు వినియోగిస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ అంశాలపై ఆధారాలతో సహా స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రుత్తల శివరామకృష్ణ, టీడీపీ నాయకులు లగుడు సన్నిబాబు, లగుడు రమేష్ పాలొన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాల్



విద్యార్థులతో మాట్లాడుతున్న రామకృష్ణ

విద్యార్థులు సందేహాలను నివృత్తి చేసుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:విద్యార్థులకు పదో తరగతి ఓ తొలిమెట్టులాంటిదని గురుకులం విశ్రాంత ఉపాధ్యాయులు ఎంవీ రామకృష్ణ అన్నారు. పీఆర్‌టీయు జిల్లా ప్రతినిధి డీవీఎస్ రావు వినతి మేరకు మండలంలోని రాజయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు.పదో తరగతి విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. పరీక్షలకు ఇంకా రెండు నెలలు సమయం వుందని, అందుచేత ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా, ఏకాగ్రతగా చదవాలని సూచించారు. తరగతి గదిలోనే ఉపాధ్యాయులను అడిగి సందేహాలను నివత్తి చేసుకోవాలన్నారు. సమయం వధా చేసుకోకుండా చదువుపై దష్టి సారించాలన్నారు .విద్యార్థి భవిష్యత్‌కు దశ, దిశను నిర్దేశించేది పదో తరగతి అని,పదిలో మంచి ప్రతిభ కనబర్చితే భవిష్యత్ బంగారు బాట పడుతోందన్నారు.పరీక్షలు ముగిసే వరకు టీవీలు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం రామకృష్ణను హెచ్ఎం నారాయణరావు, ఉపాధ్యాయులు సన్యాసిరావు సత్కరించారు.



మాట్లాడుతున్న అప్పలరాజు

మత్స్యకార కమిటీలో ఇద్దరికి చోటు

నక్కపల్లి : మండలానికి చెందిన ఇరువురుకి జాతీయ మత్స్యకార సంఘంలో చోటు కల్పించినట్లు జాతీయ మత్స్యకార సంఘ రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు తెలిపారు. మత్స్యకార నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండలంలోని దొండవాక గ్రామానికి చెందిన మత్స్యకార సొసైటి మాజీ అధ్యక్షులు పిక్కి కొర్లయ్యను ఉత్తారాంధ్ర ఇంచార్జిగాను, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పేర్ల శ్రీనివాస్‌ను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మత్స్యకార సంఘ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాసులమ్మ, జిల్లా అధ్యక్షులు కొవిరి వెంకటేష్, వర్కింగ్ అధ్యక్షులు ఎం.జగ్గారావు, నియోజకవర్గ కన్వీనర్ పిక్కి కోదండరావు,మండల అధ్యక్షులు శివ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి-గొలుగొండ:తమకు జీతాలు పెంచాలంటూ మండలంలోని ఏఎల్ పురంలో పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరసన రెండో రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చాలీచాలని జీతాలతో తమ కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే స్పందించి తమ జీతాలు పెంచాలన్నారు. అప్పటి వరకు విధులు బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:స్థానిక శారదా నికేతన్ పాఠశాలలో డి.శారదా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్దులకు మోటివేషనల్ తరగతి నిర్వహించారు. శారదనికేతన్ పాఠశాల ప్రదానో పాధ్యాయులు ఎస్.చిరంజీవులు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో లైఫ్ కోచ్ హెచ్ఆర్డి ట్రైనర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు కష్ట పడి చదవాలని సూచించారు.



విచారిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

మినీ గోకులం బిల్లుల చెల్లింపుపై విచారణ

ప్రజాశక్తి -కోటవురట్ల:గత ప్రభుత్వంలో పాడి రైతులకు నిర్మించిన మినీ గోకులం బిల్లుల దుర్వినియోగంపై రాజుపేట రైతులు చేసిన ఫిర్యాదు మేరకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో డిటిసి, డిఎస్పి, శ్రీనివాస రావు రైతులతో విచారణ చేపట్టారు. రాజుపేట గ్రామంలో సుమారు 39 మంది రైతులకు బిల్లులు చెల్లించాల్సి ఉండగా కొంతమంది రైతులకు మాత్రమే బిల్లులు నామమాత్రంగా చెల్లించడం పట్ల సమగ్ర విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2018లో రైతులు నిర్మించుకున్న మినీ గోకులం షెడ్ల బిల్లులు సాయి బాలాజీ ఎంటర్ప్రైజెస్ సంస్థ ఖాతాలో జమ కావడంతో సదరు బిల్లులు నేటికీ రైతులకు అందజేయకపోవడం వాస్తవమేనని ఇటువంటి బిల్లులు పలు మండలాల్లో చెల్లించాల్సి ఉందని వాటిపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై రమణయ్య, రాజపేట సర్పంచ్ వెంకటరమణ పలువురు రైతులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ జయరాం

దళిత సేవ పరిరక్షణ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :న్యాయానికి చిహ్నంగా అంబేద్కర్ విగ్రహాన్ని తాడేపల్లిలో ఏర్పాటు చేయడం ఆనందించ దగ్గ విషయమని నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరాం అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని పెదబొడ్డేపల్లి బ్యాంకు కాలనీలో దళిత సేవ పరిరక్షణ ప్రధాన కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, వాడవాడలా అంబేద్కర్ చరిత్ర, త్యాగం గురించి తెలిసేలా ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఎండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు, డిఎస్పీ సంఘం జిల్లా అధ్యక్షులు దాసు, ఎంఇఒ చీడిపల్లి తలుపులు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు అడిదెల బాబూరావు, దైవ సహాయ రెల్లి సంఘం నాయకులు మజ్జి దినేష్ కుమార్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కొండలరావు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి-హుకుంపేట:మిడ్ డే మీల్స్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ నేత, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, కిల్లో రామారావు, మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షరాలు వంతాల స్వప్నలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘం భవన్‌లో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ,స్కూల్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం ఖర్చు భరించి పెడుతున్నారన్నారు.ప్రతీ నెల 5వ తేదీ లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.పెరుగుతున్న ధరలకు అనుగూనంగా మెనూ చార్జీలు పెంచాలని, ప్రమాద భీమా, నష్ట పరిహారం చెల్లించాలన్నారు. సీఎం జగన్ పాద యాత్రలో ఇచ్చిన హామీ అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ ఎం, శానిటరీ వర్కర్స్ కొర్ర సోమరన్న, సీసా కోటేశ్వరరావు, కృష్ణవేణి, కాంతమ్మ, రత్నాలమ్మ, ముక్తమ్మ, చిలకమ్మ, వరలక్ష్మి, బంగారమ్మ పాల్గొన్నారు.

ఎస్మాపై అంగన్వాడీల భగ్గు

- జీవో 2 ప్రతులు దగ్ధం



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేపడుతున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించింది. దీంతో,ఎస్మాపై అంగన్‌వాడీలు శనివారం భగ్గు మగ్గుమన్నారు. జిఒ 2 కాపీలను దగ్ధం చేశారు.

అనకాపల్లి:అంగన్వాడీల సమ్మెపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగిస్తూ జీవో నెంబర్ 2ను విడుదల చేయడంపై అంగన్వాడీలు భగ్గుమన్నారు. స్థానిక నెహ్రూచౌక్ జంక్షన్‌లో మానవహారం చేపట్టి, జిఒ 2 కాపీలను దగ్ధం చేశారు. 'ఎస్మా -గిస్మా - జాంతానై' అంటూ నినదించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు మాట్లాడుతూ గతంలో ఎస్మాలను ప్రయోగించిన ఇందిరాగాంధీ, జయలలిత వంటి వారికే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు తనూజ, కాసులమ్మ, కృష్ణవేణి, ఉమానారాయనమ్మ, గంటా శ్రీరామ్, డి. శ్రీను, డిడి వరలక్ష్మి, ఎం.అప్పలరాజు, భాస్కరరావు, పాల్గొన్నారు.

చోడవరం : జీవో నెంబర్ 2 కాపీలను చోడవరం కొత్తూరు జంక్షన్‌లో అంగన్వాడీలు దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వరలక్ష్మి, నాయకులు కె.కాంతం, సూర్యకాంతం, మహాలక్ష్మి పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : న జీవో 2 కాపీలను అంగన్వాడీ కార్యకర్తలు బుచ్చెయ్యపేట నాలుగు రోడ్ల కూడలిలో దగ్ధం చేశారు. ర్యాలీ నిర్వహించి మానవాహారం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఎస్‌వి నాయుడు, ఆది వరలక్ష్మి, ఆమ్మాజీ పాల్గొన్నారు.

మునగపాక : మండల కేంద్రయిుఎ అంగన్వాడీలు శనివారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు తులసి, అంజలి, లక్ష్మీ, గంగా భవానీ, సరస్వతి, ఉమ పాల్గొన్నారు.

పరవాడ : స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరనన కార్యక్రమంలో 26వ రోజు కొనసాగింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో రిలే నిరాహార దీక్ష శిబిరంలో అంగన్వాడీలు చెవిలో బంతిపూలు పెట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో బి.జయ, వరలక్ష్మి, రామలక్ష్మి, రూపా పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలోని దీక్షా శిబిరం వద్ద శనివారం అంగన్‌వాడీలు ఒంటి కాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వ్యకాస నాయకులు డి.వెంకన్న, బిటి దొర, యూనియన్ నాయకులు జి.వరలక్ష్మి, పి కన్నతల్లి, సన్యాసమ్మ, కె. కోమలి, చెల్లయ్యమ్మ, జయ, రమణమ్మ పాల్గొన్నారు.

కె.కోటపాడు : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు దాడి ఎరుకునాయుడు డిమాండ్ చేశారు. శనివారం అంగన్వాడీల ఆందోళలనకు ఆయన మద్దతు తెలియజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎర్ర దేవుడు, గాడి ప్రసాద్, అంగన్వాడి నాయకులు డి.కుమారి, పి.భవాని పాల్గొన్నారు.

24 గంటల నిరాహార దీక్ష ప్రారంభం

అనకాపల్లి:గత 26 రోజులుగా అంగనవాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోవడంతో ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 24 గంటల రిలే నిరాహార దీక్షలు ప్రారంభించింది. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకర్రావు, జి.కోటేశ్వరరావు, ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, ఐద్వా జిల్లా నాయకురాలు డిడి వరలక్ష్మి తదితరులు అంగన్వాడీలకు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, యూనియన్ నాయకులు ఎం.దుర్గారాణి, వి.వి.రమణమ్మ ఎం.వరలక్ష్మి. బి.రత్నం, వరలక్ష్మి, కె.భారతి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:పట్టణంలో అంగన్వాడీల సమ్మె 26వ రోజుకు చేరింది. గంగిరెద్దుకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఏపి అంగ్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) ప్రాజెక్టు నాయకులు డి.మహాలక్ష్మీ, సామ్రాజ్యం, వరలక్ష్మి, శోభా పాల్గొన్నారు.

చీడికాడ: జీవో 2ను వెంటనే రద్దు చేయాలని మండల కేంద్రంలో చావిడి వద్ద జీవో కాపీలను మంటలో తగలబెట్టి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇచ్చిన మాట ప్రకారం వేతనాల పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.జానకి, ఉమా, అమ్మాజీ, పద్మ పాల్గొన్నారు

మాడుగుల: స్థానిక బస్టాండ్ ఆవరణలో అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు.మండల అంగన్వాడి ప్రాజెక్టు



మాడుగులలో...

యూనియన్ నాయకులు ఆర్ రామలక్ష్మి, పార్వతి, ధనలక్ష్మి మాట్లాడుతూ, సమ్మె 26వ రోజుకు చేరుకున్నప్పటికీ ప్రభుత్వం సానుకూలత చూపించక పోవడం దారుణమన్నారు.

ఎస్.రాయవరం: మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా



ఎస్.రాయవరంలో దండాలు పెడుతున్న అంగన్‌వాడీలు

శనివారం చేతులు జోడించి తమకు న్యాయం చేయండి మహాప్రభో అంటూ అంగనవాడీలు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, వెంకటలక్ష్మి, పద్మ, సీతారత్నం, సత్యవతి పాల్గొన్నారు.

అంగన్వాడీలకు కెవిపిఎస్ మద్దతు

గొలుగొండ:మండలంలో సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు కెవిపిఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా గత 26 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే స్పందించకపోవడం దారుణమన్నారు. కనీసం ప్రభుత్వం సమస్యల పరిష్కారం చేస్తానని చొరవ చూపలేదన్నారు.

విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీలు సమ్మెను ఉధృతం చేశారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 24 గంటల దీక్షకు దిగారు. శనివారం రాత్రి సమ్మె శిబిరంలోనే నిద్రించారు. సమ్మెనుద్దేశించి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు వై.తులసి మాట్లాడుతూ సిఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని పోరాడుతున్న తమ పట్ల ప్రభుత్వం చాలా కర్కశంగా వ్యవహరించిందన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు అయోధ్యరాం, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ మద్దతు తెలిపి మాట్లాడారు. దీక్షలో అర్బన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నూకరత్నం, ఎం.వెంకటలక్ష్మి, ఎఐటియుసి నాయకులు పి.శ్యామలా దేవి, ఐఎఫ్‌టియు నాయకులు రామలక్ష్మి, సుజాత, సంతోషి, కనకమహాలక్ష్మి, పద్మ, పార్వతీదేవి పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం అమానుషం : సిపిఎం, సిఐటియు

అంగన్‌వాడీలపై జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జిఒ నెంబరు 2 ద్వారా ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దారుణమని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కనీస వేతనం రూ.26 వేలు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించాల్సిందేనన్నారు. ఎస్మా ప్రయోగాన్ని సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఖండించారు.

తగరపువలస: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు స్థానిక వై జంక్షన్ వద్ద రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు భీమిలి జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి మాట్లాడుతూ, ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగుతుందని, ఎస్మాకు బెదిరేదిలేదని స్పష్టం చేశారు. ఈ దీక్షలకు యుటిఎఫ్ భీమిలి మండల కమిటీ మద్దతు తెలిపింది. యుటిఎఫ్ నాయకులు రాము, సిఐటియు జోన్ అధ్యక్షులు రవ్వ నరసింగరావు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు కె.వెంకటలక్ష్మి, జిల్లా కోశాధికారి కె.పద్మావతి, ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, కొవ్వాడ లక్ష్మి, దన లక్ష్మి, ఎఐటియుసి అనుబంధ సంఘం ప్రతినిధులు అనురాధ పాల్గొన్నారు

పెందుర్తి : ఎంపిడిఒ కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు నిరాహారదీక్ష చేపట్టారు. అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ జారీ చేయడాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్ తీవ్రంగా ఖండించారు.ఈ దీక్షలకు ఐద్వా నాయకులు బి.అనంతలక్ష్మి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సూర్యకాంతం, జగ్గయ్యమ్మ, నాగమణి, లక్ష్మి, అప్పలనరసమ్మ, బృందావతి, భవాని తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తిలో మాట్లాడుతున్న జగన్

అంగన్వాడీల సమ్మెపై ఎస్మా దుర్మార్గం

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

అనకాపల్లి, దేవరాపల్లి :

అంగన్‌వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న శనివారం వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. తక్షణమే ఎస్మా జీవోను ఉపసంహరించాలని, అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత 26 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తుండగా, వారిని ఎస్మా చట్టపరిధిలోకి తీసుకువచ్చి సమ్మెపై నిషేదం విధించడం అప్రజాస్వామిక చర్య అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ చర్యలను కార్మిక, ప్రజా సంఘాలు, పార్టీలు, ప్రజాతంత్ర వాదులు, మేధావులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ అంగన్‌వాడీలకు అండగా నిలబడాలని కోరారు. అంగన్‌వాడీల సమస్యల పట్ల ఇదే వైఖరి కొనసాగితే ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నక్కపల్లి:అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జి.వో 2 జారీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు . గత 26 రోజులుగా అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా సమ్మె చేస్తున్నారని, ఇప్పుడు వారిని ఎస్మా చట్టపరిధిలోకి తీసుకువచ్చి సమ్మెపై నిషేదం విధించడం అప్రజాస్వామికమైన చర్య అని అన్నారు. సమ్మెను నిషేదిస్తూ, సమ్మె కాలానికి జీతాల్లో కోత విధించడం అత్యంత దుర్మార్గమైనదని, రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ చర్యలతో సమ్మెను విచ్ఛిన్నం చేయాలనుకోవడం అనైతికమన్నారు.